క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

తిరుమలగిరి : మండలంలోని మామిడాల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి గురువారం ఎమ్మెల్యే మందుల సామేల్ రానున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్ బుధవారం తెలిపారు. మధ్యాహ్నం తిరుమలగిరి మున్సిపాలిటీలో అమృత్ పథకంలో భాగంగా రూ.1.3కోట్లతో వాటర్ ట్యాంకులు, సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

నాగారం : మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి గురువారం ఎమ్మెల్యే మందుల సామేల్ రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, స్థానిక ఏపీఎం శోభారాణి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

20న చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని హైవే వెంట శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఈనెల 20న ఆవిష్కరించనున్నట్లు ఆ సంఘం సభ్యులు బుధవారం తెలిపారు. ఈ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే మందుల సామేలు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

సివిల్‌సప్లయ్ గోదాములను పరిశీలించిన ఆర్డీఓ



గోదాములను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ వేణుమాధవరావు

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని నంద్యాలగూడెంలో గల సివిల్‌సప్లయ్ గోదాములను ఆర్డీఓ వేణుమాధవరావు బుధవారం పరిశీలించారు. త్వరలో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి భద్రపరచడానికి గోదాములను సిద్ధం చేయాలని, గోదాముల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. దాదాపు 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ గోదాములలో నిల్వ చేయవచ్చని తెలిపారు. కాగా నంద్యాలగూడెంలో ఐకేపీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు కృష్ణారెడ్డి ఆర్డీఓకు విన్నవించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్రప్రసాద్, ఆర్ఐ అంజయ్య, సివిల్ సప్లయ్ సూపర్‌వైజర్ వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ కమిటీ ఎన్నిక

నాగారం : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా బుధవారం నాగారం గ్రామంలో ఇందిరమ్మ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా గ్రామప్రత్యేక అధికారి, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ సభ్యులుగా గ్రామస్తులు జాజుల వీరయ్య, అనంతుల వెంకటయ్య, భైరబోయిన మహేష్, గ్రామ మహిళా స్వయం సహాయక సంఘాల నుంచి చిప్పలపల్లి లక్ష్మమ్మ, మంగదుడ్ల గంగమ్మను ఎన్నుకున్నారు.

మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

తిరుమలగిరి : తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం మండలాల్లోని గ్రామ మంచినీటి సహాయకులకు, మల్టీపర్పస్ సిబ్బందికి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సహాయకులకు హ్యాండ్ పంపు, మోటార్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీలు, నీటి నాణ్యత పరీక్షలపై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎ.భీమ్‌సింగ్, ఏఈ కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల నుంచి ఫోన్లు కొనుగోలు చేయొద్దు

నాగారం : అపరిచిత వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లను కొనుగోలు చేయొద్దని ఎస్ఐ ఎం.ఐలయ్య అన్నారు. ఇటీవల ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు దారుడికి అప్పగించి మాట్లాడారు. మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామానికి చెందిన గుంటకండ్ల ముకుందారెడ్డి అనే వ్యక్తి గత ఏడాది నవంబర్‌లో తిరుమలగిరిలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సభకు వెళ్లి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, దీంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్ నందు నమోదు చేసి ఫోన్‌ను ట్రేస్ చేసి, ఫిర్యాదుదారుడికి అప్పగించినట్లు తెలిపారు. మండల ప్రజలు ఎవరైనా దొరికిన ఫోన్లను కానీ, తక్కువ ధరలకు అమ్మే ఫోన్‌లను కానీ, అపరిచిత వ్యక్తుల వద్ద నుంచిగా కొనుగోలు చేయవద్దని సూచించారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో వసతులు కరువు

- నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు
- తాగునీరు లేక అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



తుంగతుర్తిలోని ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

తుంగతుర్తి : నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుంగతుర్తిలో సుమారు 20ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. కొంత కాలం పాటు బస్టాండ్‌లో వసతులు మెరుగ్గానే కన్పించాయి. కానీ నాలుగైదేళ్లుగా బస్టాండ్‌లో నీటి సౌకర్యం లేకపోవడంతో పాటు టాయిలెట్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారి నేడు పూర్తి శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి రావడానికి ఆసక్తి చూపడంలేదు. బస్టాండ్‌కు ప్రయాణికులు రాకుండా తుంగతుర్తి మెయిన్‌రోడ్డులో ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ బస్సులు ఎక్కాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అలాగే బస్టాండ్‌లో వాచ్‌మెన్, స్వీపర్ లేక అధ్వానంగా మారుతుంది. బస్టాండ్ ఆవరణలో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఈ మధ్య బస్టాండ్‌లో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు, కాని అది పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఈ బస్టాండ్ నుంచి సూర్యాపేట, హైదరాబాద్, హన్మకొండ, వరంగల్, యాదగిరిగుట్ట, జగద్గీరిగుట్ట, ఖమ్మం పట్టణాలకు పలు బస్సు సర్వీసులు ఉన్నాయి. బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో రాత్రి వేళల్లో వచ్చే బస్‌డ్రైవర్లు, కండక్టర్లు నిద్రించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో నైట్ డ్యూటీలు చేయడానికి డ్రైవర్లు, కండక్టర్లు కూడా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



తుంగతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేక అవస్థలు పడాల్సివస్తుంది. మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌కు రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి.

– జక్కి కాశీ, తుంగతుర్తి

మహనీయుల విగ్రహాలకు పుష్పాభిషేకం



జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణన ప్రక్రియను ప్రారంభించిన సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆ సంఘం నాయకులు మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావ్ పూలే విగ్రహాలకు బుధవారం పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కొత్తగట్టు మల్లయ్య, సీహెచ్.హన్మంతు, ఎం.శ్రీకాంత్‌గౌడ్, బ్రహ్మం, సోమరాజు, సోమేష్, యాదగిరి, శ్యామ్, రాములు, గణేష్, వెంకన్న, నరేష్, కిరణ్, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

మద్యం నిషేధానికి గ్రామస్తుల ర్యాలీ



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు, పోలీస్ సిబ్బంది

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం చేపట్టాలని బుధవారం గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంపూర్ణ మద్యపాన నిషేధానికి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా మద్యపాన నిషేధ కమిటీ సభ్యులు మాట్లాడారు. గ్రామంలో మద్యంతో ఎన్నో అనర్థాలు ఏర్పడి వివాదాలు ఘర్షణలు తలెత్తుతున్నాయనీ, ఆర్థికంగా కుటుంబాలు చితికిపోతున్నాయని వారు అన్నారు. ఈ సందర్భంగా మద్యపాన కమిటీ చైర్మన్ దొంతగాని కర్ణాకర్ ఆధ్వర్యంలో బెల్ట్‌షాపు యజమానులకు పోలీస్ సిబ్బంది కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గణపారపు సత్యం, కేశబోయిన మల్లయ్య, గుంటూరి వీరన్న, జానయ్య, వెంకన్న, శ్రీశైలం, దానియల్, పంచాక్షరి, నగేష్, వినోద, పద్మ, శ్రీశైలం, జహీర్‌బాబా పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలి



ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

అర్వపల్లి : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల నియోజకవర్గ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పింగళి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.యల్లయ్య కోరారు. బుధవారం అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉల్లెందుల సైదులు, జలగం పురుషోత్తంల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవంబర్ 6లోపు ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.చంద్రారెడ్డి, జి.శంకర్, కె.రమేష్, ఉపాధ్యక్షుడు మధుకర్, పీడీ పి.మల్లేష్, నాగరాజు, శ్రీదేవి, విమల, అంజలి, శోభారాణి, చినవెంకట్‌రెడ్డి, వీరయ్య, శ్రీరాములు, నాగయ్య, ప్రశాంతి పాల్గొన్నారు.

కేంద్రం ధరల భారాన్ని మోపడం దుర్మార్గం



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ధరలను అదుపు చేయకుండా ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో జరిగిన పార్టీ మండల బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకులను కొట్టి గద్దలకు వేసినట్లుగా కేంద్రం ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్ శక్తులకు లాభాలు వేయడం భావ్యం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర సరుకుల ధరలు వ్యతిరేకంగా అక్టోబర్ 17నుంచి 28వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మండలంలోని లింగాల గ్రామంలో ఈనెల 26న పార్టీ 8వ మండల మహాసభను నిర్వహించనున్నట్లు ఆ సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, మడ్డి అంజిబాబుగౌడ్, గుంజ వెంకటేశ్వర్లు, ఇరుగు రమేష్, కొండమీద రాములు, శ్రీకాంత్, మాతంగి వెంకన్న, సుమీల పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజానికి పోరాడాలి

తిరుమలగిరి : దోపిడీ రహిత సమాజం కోసం కమ్యూనిస్టులందరూ పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. బుధవారం మండలంలోని తొండ గ్రామంలో పార్టీ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమ సమాజం కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పోరాడాలన్నారు. ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 6గ్యారంటీలను సక్రమంగా అమలు చేయాలని, రైతు రుణమాఫీ, రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ గుమ్మడవెల్లి ఉప్పలయ్య, కడారి లింగయ్య, వెంకటయ్య, సోమయ్య, వెంకన్న, భిక్షం, సోమయ్య, ఉప్పలయ్య, సోమయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోళ్లు ఆలస్యం



తిరుమలగిరి మార్కెట్‌లో హమాలీలు, దడ్వాయిలతో మాట్లాడుతున్న అధికారులు

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం బస్తాలు తట్టు బస్తాలు అయితేనే తూకం వేస్తామని హమాలీలు అనడంతో బుధవారం కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. స్థానిక మార్కెట్ యార్డుకు 13వేల బస్తాల ధాన్యం వచ్చింది. కొనుగోలుదారులు ప్లాస్టిక్ బస్తాలలో తూకం వేయాలని హమాలీలను కోరారు. అయితే ప్లాస్టిక్ బస్తాలతో తమకు ఇబ్బందులవుతాయని, గతంలో లాగా తట్టు బస్తాలయితేనే తూకాలు వేస్తామని హమాలీలు తేల్చిచెప్పారు. దీంతో మార్కెట్‌లో టెండర్లు ఆలస్యం కావడంతో రైతులు ధర్నాకు దిగారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, తహసీల్దార్ హరిప్రసాద్, ఎస్ఐ సురేష్ కలిసి హమాలీలు, వ్యాపారులతో మాట్లాడి ఈ ఒక్కరోజు తూకాలు వేయాలని కోరడంతో హమాలీలు అంగీకరించారు. దీంతో కొనుగోళ్లు ఆలస్యంగా మొదలయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న రేఖ

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రేఖ చారిటబుల్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. బుధవారం అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 250మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో పిల్లలకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, క్రీడాదుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే అవసరమైన పాఠశాలల్లో స్వచ్ఛమైన నీటిని అందించడానికి ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు మైక్‌సెట్, క్రీడా సామగ్రిని అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, ఇన్‌చార్జ్ హెచ్ఎం వి.శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ పి.మల్లేష్, ఉపాధ్యాయులు విమల, మధుకర్, రమేష్, శ్రీరాములు, వీరయ్య, అంజలి, నాగయ్య, శోభ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో నేడు వాహనాల వేలం

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు, అధిక వేలం పాడిన వారికి వాహనం ఇవ్వనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఈఎండీ 50శాతం చెల్లించి పాల్గొనాలని సూచించారు.

పాత కక్షలతో దాడి.. 15 మందిపై కేసు

ఆత్మకూర్(ఎస్): మండలంలోని పాతర్లపహాడ్ గ్రామంలో పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 15మంది అదే గ్రామానికి చెందిన జటంగి గంగయ్యపై సోమవారం దాడికి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆరెపుల సైదులు, నవీన్, మహేష్, ముఖేష్, పేతురు, సన్నీ, విష్ణు మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు.

ఉపాధ్యాయులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత



తిరుమలగిరి : నూతన ఉపాధ్యాయులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఎంఈఓ



ఆత్మకూర్(ఎస్) : ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న ఎంఈఓ ధారాసింగ్

తిరుమలగిరి : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యా బోధన అందించాలని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య కోరారు. డీఎస్సీ 2024లో నియామకమైన ఉపాధ్యాయులకు బుధవారం మండల విద్యాధికారి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో వివిధ పాఠశాలలో 25మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సోమేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషిచేయాలి

అర్వపల్లి : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషిచేయాలని ఎంఈఓ బాలునాయక్ కోరారు. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో జాజిరెడ్డిగూడెం మండలానికి ఆరుగురు ఉపాధ్యాయులు నియామకమయ్యారు. ఈ సందర్భంగా వారికి బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ఆయన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు దబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్‌గౌడ్, నూతన ఉపాధ్యాయులు ధరావత్ భద్రమ్మ, జె.భిక్షం పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలానికి ఏడుగురు ఉపాధ్యాయులు నియామకమయ్యారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం రిపోర్టు చేసి ఎంఈఓ ధారాసింగ్ చేతుల మీదుగా ప్రొసీడింగ్ కాపీలను అందుకున్నారు. అనంతరం వారికి కేటాయించిన పాఠశాలలో విధుల్లో చేరారు.

మద్దిరాల : ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ తండు వెంకటనారాయణగౌడ్ ప్రొసీడింగ్ కాపీలను అందజేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి, సీఆర్పీలు శ్రీనివాస్, నవీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండలంలోని నూతన ఉపాధ్యాయులకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఎంఈఓ నకిరేకంటి రవి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 8ఎస్జీటీలు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్‌లు నియామితులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండలానికినూతన ఉపాధ్యాయులుగా వచ్చిన వారు బుధవారం ఆయా పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టినట్లు మండల విద్యాధికారి రాములునాయక్ తెలిపారు. మండలంలో ఖాళీగా ఉన్న 7ఎస్జీటీలకు గాను 5గురు విధులకు హాజరైనట్లు ఆయన తెలిపారు. విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

సొంత మండలానికి రావడం సంతోషంగా ఉంది



తిరుమలగిరి : చిన్నప్పటి నుంచి తనకు ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టం. 2014 నుంచి 2016వరకు డీఈడీ పూర్తి చేసి అనంతరం డిగ్రీ పూర్తి చేశాను. స్థానికంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వలంటీర్‌గా పనిచేశాను. 2024 డీఎస్సీలో ఎంపికై తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాను. సొంత మండలంలో ఉపాధ్యాయుడిగా చేరడం ఎంతో సంతోషంగా ఉంది.

– తుప్పతి గిరి, మాలిపురం

పాఠాలు బోధించడం మర్చిపోలేని ఆనందం



ఆత్మకూర్(ఎస్) : విద్యార్థులకు పాఠాలు బోధించాలనుకోవడం ఎన్నో ఏళ్ల కల. ఈ రోజు విద్యార్థులకు పాఠాలు బోధించడం మర్చిపోలేని ఆనందంగా ఉంది. ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలనే కోరిక ఉండడంతో పెళ్లి చేసుకున్నా భర్త ప్రోత్సాహంతో చదివి మక్తాకొత్తగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా ఉద్యోగం సాధించాను. విద్యార్థులకు పాఠాలు బోధించడం కొత్త అనుభూతిని ఇస్తుంది.

– మల్లిక, ఎస్జీటీ, మక్తాకొత్తగూడెం

పుట్టినరోజు నాడే ఉద్యోగంలో చేరా



చివ్వెంల : నా పుట్టినరోజు నాడే టీచర్ ఉద్యోగంలో చేరడం ఆనందంగా ఉంది. మాది నడిగూడెం మండలం సిరిపురం స్వగ్రామం. ఎలాంటి కోచింగ్ లేకుండానే ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. మొదటి రోజు పాఠశాలకు వెళ్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయి.

– షేక్, నజీర్, ఎస్జీటీ, మున్యానాయక్‌తండా, చివ్వెంల

ఉత్తమ బోధనకు కృషి



నూతనకల్ : విద్యార్థులకు ఉత్తమ పాఠాలు బోధించి ఉన్నతంగా తీర్చిదిద్దడమే తన ఆశయం. పుట్టుకతోనే పోలియోతో వచ్చినా కర్ర సహాయంతో నడుస్తూ జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని సంపాదించాలనే తపనతో 2018 డీఎస్సీ పరీక్షలో సెలక్ట్ కాకపోవడంతో ఎలాగైన ఉద్యోగం సాధించాలనే తపనతో డీఎస్సీ 2024ఫలితాల్లో 76.77మార్కులతో జిల్లా స్థాయిలో 38వ ర్యాంకు సాధించాను. మండలంలోని చిల్పకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధుల్లో చేరాను.

– జటంగి సోనయ్య, ఎస్జీటీ, తాళ్లసింగారం, నూతనకల్

ఉపాధ్యాయ కోరిక తీరింది



పెన్‌పహాడ్ : జీవితంలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనే తన కోరిక నెరవేరింది. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్తెనపల్లి సెక్షన్‌లో గేట్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ తన చిరకాల కోరిక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే తపనతో ఉద్యోగం చేస్తూనే ఎంతో కష్టపడి చదివాను. అనుకున్నట్లుగానే డీఎస్సీ ఫలితాల్లో 88వ ర్యాంకు సాధించాను. మండలంలోని చిన్న సీతారాంతండా ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా చేరాను.

– గందు సతీష్, ఎస్జీటీ, చీదెళ్ల, పెన్‌పహాడ్

జీవిత ఆశయం నెరవేరింది



నూతనకల్ : చిన్ననాటి నుంచి క్రీడారంగంపై ఆసక్తి ఉండడంతో పాటు నిజజీవితంలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపిక కావాలనే కోరిక నెరవేరింది. గతంలో ఉద్యోగ సాధనకు తాను కృషి చేశాను. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో 63మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాను. ప్రస్తుతం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా నియామకమయ్యాను.

– చెరుకు నాగేందర్, పీడీ, వేల్పుచర్ల, జాజిరెడ్డిగూడెం మండలం

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సీఐ రఘువీర్‌రెడ్డి

అర్వపల్లి : మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ ఈర్ల సైదులు కోరారు. బుధవారం మండలంలోని తిమ్మాపురంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిషేధం, గంజాయి నియంత్రణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాబృందం ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు, ఎం.శంకర్, గడ్డం ఉదయ్, పి.శ్రీకాంత్, మేడిపల్లి వేణు, పి.ఉపేందర్, మంజుల, రాధ, ప్రవంతి, శిరీష, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నమ్మొద్దు

తిరుమలగిరి : ప్రజలు మూఢనమ్మకాలు నమ్మొద్దని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో మూఢనమ్మకాలు, సైబర్‌నేరాలపై, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు, గుట్కాలకు దూరంగా ఉండాలని, వాటిని కొనుగోలు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ నికోలస్, హరిబాబు, ఎల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, చారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మద్దిరాల : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ కల్వల శ్రీనివాస్ అన్నారు. ఎస్ఐ వీరన్న ఆదేశానుసారం మండల కేంద్రంలో బుధవారం డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది చందు, కంఠం, కుమార్, జలేందర్, రామ్మూర్తి, సోమనర్సయ్య, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : ప్రభుత్వం పశువులకు అందిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి రవికుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తుగా టీకాలు వేయిస్తే రోగాల బారి నుంచి కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి

అర్వపల్లి : పశువులకు వ్యాధులు సంక్రమించకుండా పాడిరైతులు ముందస్తుగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి బి.అర్జున్ కోరారు. మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ పద్మ, గోపాలమిత్రలు లింగయ్య, సురేందర్, అర్జున్, యాకయ్య, రైతులు ఉన్నారు.